ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రికలో పనిచేయడానికి
ఆసక్తి కలవారికి ఆహ్వానము.
వివరాలకు సంప్రదించండి : 7780470374
మహబూబాబాద్ జిల్లాలో ఖాళీలు :

| | | | |
|---|---|---|---|
| కొత్తగూడ | గార్ల / కురవి | దంతాలపల్లి | పెద్దవంగర |
| గంగారం | బయ్యారం | చిన్నగూడూరు | నెల్లికుదురు |
| కేసముద్రం | మరిపెడ | నర్సింహులపేట | ఇనుగుర్తి |



TELTEL/2022/83842

PRABHATA GAMANAM
# ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

ఆదివారం 08, మార్చి 2026 | వరంగల్ | సంపుటి :04 | సంచిక :176 | పేజీలు :4 | వెల. 3/-


# మోడల్ మార్కెట్ అయ్యేనా?

## మోడల్ మార్కెట్ రైతుల కష్టాలకు ఫుల్ స్టాప్

కేసముద్రం వ్యవసాయ మార్కెట్ మోడల్ మార్కెట్ గా మారితే.. రైతన్నలకు కష్టాలు తీరుతాయని రైతు సం ఘాల నాయకులు అభిప్రాయ పడుతున్నారు. ధాన్యం నిల్వకు సరైన వసతులు అందుబాటులోకి వస్తాయి. అధికారులు తరుచూ సెలవులు ప్రకటించే వ్యవస్థకు స్వస్థి చెప్పవచ్చు.జీరో దందాకు శుభం పలకవ చ్చు.రైతులు తెచ్చిన ధాన్యం కూడా నీటిపాలు కాకుండా కాపాడుకొని ఆశించిన ధరకు విక్రయించి.. రైతులు సంతోషంగా ఇంటికి వెళ్లే మార్గాలు అందుబాటులోకి వస్తాయి. మార్కెట్ కమిటీ తీరు కూడా.. మారిపోతుంది. ధాన్యానికి రక్షణ వ్యవస్థ ఏర్పడుతుంది. అధికారులు నిర్లక్ష్యం వీడి నిబద్ధతతో పని చేయగలుగుతారు. మానుకోట జిల్లానే కాక.. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రైతన్నలకు మోడల్ మార్కెట్ ఎంతగానో ఉపయోగ పడుతోంది. ఇవన్నీ మోడల్ మార్కెట్ ద్వారానే సాధ్యమవుతోంది. కానీ.. అధికారుల నిర్లక్ష్యమో.. ప్రభుత్వ అసమర్ధ తనమో లేక.. మార్కెట్ యంత్రాంగం విఫలం కారణంగానో తెలియని అనేక ప్రశ్నలు రైతుల్లో, స్థానిక నాయకుల్లో మెదులుతున్నాయి. జాతీయ గుర్తింపు ఉన్నప్పటికీ.. ఎందుకు మోడల్ మార్కెట్ గా రూపాంతరం చెందడం లేదు. ?, జిల్లా స్థాయి అధికారులు సైతం ప్రణాళికలు సిద్ధం చేసి, స్థలం ఖరారు చేసినప్పటికీ.. ఎందుకు కార్యరూపం దాల్చడం లేదు అనే ప్రశ్నలకు సరైన సమాధానం దొరకని పరిస్థితి.

- వ్యవసాయ మార్కెట్ కి మహర్దశ ఎప్పుడో?
- పదేళ్లుగా తాత్సారం చేస్తున్న ప్రభుత్వం
- ప్రస్తుత మార్కెట్ లో రైతన్నల ధాన్యానికి రక్షణ కరువు?
- సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు
- మానుకోట ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకోవాలని డిమాండ్
- కేసముద్రం మార్కెట్ ను మోడల్ మార్కెట్ చేయాలంటున్న రాజకీయ పక్షాలు




"అది ఒకప్పుడు ఆసియా ఖండంలోనే పసుపు దిగుమతులకు చిరునామా.. దేశంలోనే రెండో అతిపెద్ద పసుపు మార్కెట్‌గా వెలుగొందిన ఖ్యాతి దాని సొంతం. కేవలం స్థానిక రైతులకే కాదు, పొరుగు జిల్లాల అన్నదాతలకు కూడా అది ఒక నమ్మకమైన వేదిక. కానీ, కాలక్రమేణా ఆ వైభవం మసకబారింది. అభివృద్ధి మాటలు కోటలు దాటుతున్నా, క్షేత్రస్థాయిలో అడుగులు మాత్రం గడప దాటడం లేదు. జాతీయ స్థాయి గుర్తింపు ఉన్నా.. కనీస వసతుల కల్పనలో 'కేసముద్రం వ్యవసాయ మార్కెట్' నేడు వెనుకబడి పోయింది. ఒకవైపు పాలకుల ఉదాసీనత, మరోవైపు వ్యవస్థలోని లోపాలు వెరసి అన్నదాతను అరిగోస పెడుతున్నాయి. అసలు 'మోడల్ మార్కెట్' కల ఎందుకు సాకారం కావడం లేదు? నేషనల్ మార్కెట్‌లో అసలేం జరుగుతోంది? అన్నదాతల ఆవేదనపై 'ప్రభాత గమనం' అందిస్తున్న ప్రత్యేక విశ్లేషణ..."

— కేసముద్రం, ప్రభాత గమనం

---

### టెన్త్ పరీక్షల్లో వంద శాతం
## ఫలితాలు సాధించాలి



జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

..4లో

---

- గ్రామాల్లో యథేచ్ఛగా అమ్మకాలు
- సిండికేట్ల లాభాలు
- తూతూ మంత్రంగా ఎక్సైజ్ దాడులు
- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న బెల్ట్ షాపులు

### గార్ల మండలంలో
## బెల్టు దందా

— వివరాలు3వ పేజీలో..

---

### 13న మానుకోటలో
## జాబ్ మేళా

జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మధుసూదన రాజు

— వివరాలు4వ పేజీలో..

ఆదివారం
08.03.2026
www.prabhatagamanam.com
PRABHATA GAMANAM ప్రభాత గమనం తెలుగు దినపత్రిక




# మోడల్ మార్కెట్ రైతుల కష్టాలకు ఫుల్ స్టాప్

**కేసముద్రం వ్యవసాయ మార్కెట్ మోడల్ మార్కెట్ గా మారితే.. రైతన్నలకు కష్టాలు తీరుతాయని రైతు సం ఘాల నాయకులు అభిప్రాయ పడుతున్నారు. ధాన్యం నిల్వకు సరైన వసతులు అందుబాటులోకి వస్తాయి. అధికారులు తరుచూ సెలవులు ప్రకటించే వ్యవస్థకు స్వస్థి చెప్పవచ్చు.జీరో దందాకు శుభం పలకవ చ్చు.రైతులు తెచ్చిన ధాన్యం కూడా నీటిపాలు కాకుండా కాపాడుకొని ఆశించిన ధరకు విక్రయించి.. రైతులు సంతోషంగా ఇంటికి వెళ్లే మార్గాలు అందుబాటులోకి వస్తాయి. మార్కెట్ కమిటీ తీరు కూడా.. మారిపోతుంది. ధాన్యానికి రక్షణ వ్యవస్థ ఏర్పడుతుంది. అధికారులు  నిర్లక్ష్యం వీడి నిబద్ధతతో పని చేయగలుగుతారు. మానుకోట జిల్లానే కాక.. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రైతన్నలకు మోడల్ మార్కెట్ ఎంతగానో ఉపయోగ పడుతోంది. ఇవన్నీ మోడల్ మార్కెట్ ద్వారానే సాధ్యమవుతోంది. కానీ.. అధికారుల నిర్లక్ష్యమో.. ప్రభుత్వ అసమర్థ తనమో లేక.. మార్కెట్ యంత్రాంగం విఫలం కారణంగానో తెలియని అనేక ప్రశ్నలు రైతుల్లో, స్థానిక నాయకుల్లో మెదులుతున్నాయి. జాతీయ గుర్తింపు ఉన్నప్పటికీ.. ఎందుకు మోడల్ మార్కెట్ గా రూపాంతరం చెందడం లేదు. ?, జిల్లా స్థాయి అధికారులు సైతం ప్రణాళికలు సిద్ధం చేసి, స్థలం ఖరారు చేసినప్పటికీ.. ఎందుకు కార్యరూపం దాల్చడం లేదు అనే ప్రశ్నలకు సరైన సమాధానం దొరకని పరిస్థితి.**

# మోడల్ మార్కెట్ అయ్యేనా?

- **వ్యవసాయ మార్కెట్ కి మహర్దశ ఎప్పుడో?**
- **పదేళ్లుగా తాత్సారం చేస్తున్న ప్రభుత్వం**
- **ప్రస్తుత మార్కెట్   లో రైతన్నల ధాన్యానికి రక్షణ కరువు?**
- **సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు...**
- **మానుకోట ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకోవాలని డిమాండ్...**
- **కేసముద్రం మార్కెట్ ను మోడల్ మార్కెట్ చేయాలంటున్న రాజకీయ పక్షాలు**

కేసముద్రం మార్చి 7(ప్రభాత గమనం): అది జాతీయ మార్కెట్. అక్కడి మార్కెట్ కి వచ్చే పసుపుకు ఎనలేని ప్రాశస్త్యం ఉంది. దేశంలోనే పసుపును ఎక్కువగా అందించే రెండవ మార్కెట్ గా దానికి పేరుంది. స్థానికులు, చుట్టుప్రక్కల గ్రామాలే కాక... ఇతర జిల్లాల నుంచి సైతం ఈ మార్కెట్ కి రైతులు వారివారి ధాన్యాలతో పోటెత్తుతారు. ఇలాంటి తరుణంలో ఆ మార్కెట్ను విస్తరించే దిశగా.. ప్రభుత్వం మోడల్ మార్కెట్కు అడుగులు వేసింది. ప్రణాళికలు సైతం సిద్ధం చేసింది. కానీ అకస్మాత్తుగా కొన్ని ఏండ్ల నుంచి అది కార్యరూపం దాల్చడంలేదు.
మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని వ్యవసాయ మార్కెట్ కు జాతీయ మార్కెట్ అభివృద్ధి అనేది నల్లేటిమీద నావాలాగే ఉంది. ఏండ్లు గడుస్తున్నా... అభివృద్ధిపై పాలకులు దృష్టి సారించడం లేదు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో.. కేసముద్రం మార్కెట్కు మహార్ధశ వస్తుందని భావించినప్పటికీ.. నాటి పాలకులు.. తూతూ మంత్రంగానే చేతులు దులుపుకొని సరిపెట్టారు. కేసముద్రం వ్యవసాయ మార్కెట్ జాతీయ స్థాయి కావడంతో..  అన్నదాతలు పంటల విక్రయానికి  పెద్దఎత్తున కేసముద్రంకు విచ్చేస్తారు. ఇదే తరుణంలో.. ఈ మార్కెట్లో రైతన్నలకు ఇబ్బందులు కూడా తప్పడం లేదు. పేరుకు నేషనల్ మార్కెట్ అయినప్పటికీ..మార్కెట్ పరిధిలో జోరుగా జిరో దందా నడుస్తుందని ప్రజలు ఆరోపిస్తున్నారు.దింతో వ్యవసాయ మార్కెట్ కు ధాన్యం వచ్చుడే కరువైంది. వసతుల కల్పనలో అధికారులు, పాలకులు విఫలమవుతూ వస్తూనే ఉన్నారు. అన్నదాతలను అక్కున చేర్చుకోవాల్సిన ప్రభుత్వం.. అందుకు తగిన చర్యలు తీసుకోవడంలో ఫెయిల్ అవుతున్నారు. రైతన్నలు ఆరుగాలం పండించి తీసుకొచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో కూడా తాత్సారం చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. సెలవుల పేరుతో కుంటి సాకులు వెతుక్కుంటూ.. అన్నదాతలను అరిగోసలు పెడుతున్న సందర్భాలు ఇటీవలికాలంలో అనేకం చూడవచ్చు. అయితే.. దీనంతటికి ప్రధాన కారణం.. మార్కెట్లో వసతలు లేమి అనే చెప్పవచ్చు.  ధాన్యం నిల్వకు సరిపడా సరైన వసతులు లేకనే ఈ సమస్య తలెత్తుతుందని తెలుస్తోంది. మోడల్ మార్కెట్గా కేసముద్రం వ్యవసాయ మార్కెట్ రూపాంతరం చెందితే.. ఈ సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. కానీ ప్రస్తుత ప్రభుత్వ పెద్దలు ఆ దిశగా అడుగులు వేయాలని రైతులు కోరుతున్నారు.

## - పాలక కమిటీ అయినా శ్రద్ధచూపేనా...?

రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ సర్కార్.. ఇటీవలి కాలంలో కేసముద్రం మార్కెట్ పాలకమండలి మోడల్ మార్కెట్ కు కృషి చేస్తామని చెప్పి కల్వల గ్రామంలో స్థలాన్ని పరిశీలించినట్లు తెలిసింది. మార్కెట్ కమిటీ పాలక వర్గాలు స్థలాలను చూచుడు తప్పా చేసేది ఏమి లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇదిగో తోక అంటే అదిగో పులి అన్న చందంగా పాలక మండలిల తీరు ఉంది అని ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.అసలు మార్కెట్ కమిటీ పాలకమండలి వ్యవసాయ మార్కెట్ ను పట్టించుకోవడం లేదని తెలుస్తుంది.అమాస పున్నానికి చైర్మన్ వచ్చి వెలుతున్నాడని ప్రతి పక్ష నాయకులు అంటున్నారు. మరి ఇప్పటికైనా పాలక కమిటీ స్పందించి.. మోడల్ మార్కెట్గా మార్చడంలో కృషి చేయాలని మండల ప్రజలు, మండలం పరిధిలోని రైతన్నలు కోరుతున్నారు. స్థానికత నుంచి రాష్ట్రం వరకు మొత్తం కాంగ్రెస్ ప్రభుత్వమే ఉండటంతో.. ఈ పాలకవర్గమైన.. కేసముద్రం జాతీయ మార్కెట్ను మోడల్ మార్కెట్గా మార్చడంలో తమవంతు పాత్ర పోషించి... చిరస్థాయిగా ఉండిపోయే విధంగా వారి పాలకవర్గానికి గుర్తింపు తెచ్చుకోవాలని మండల నాయకులు కోరుతున్నారు. మరి పాలకవర్గం.. ఆ దిశగా.. ఏమైనా ప్రయత్నాలు చేస్తుందా... లేక మోడల్ మార్కెట్ కలను... నీరుగార్చుతుందా వేచి చూడాల్సిందే..

## స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపేనా?

**స్థానిక ఎమ్మెల్యే మురళి నాయక్ కేసముద్రం మార్కెట్ పై ప్రత్యేక చొరవ తీసుకోవాలనే డిమాండ్ మండలంలో బలంగా వినిపిస్తోంది. గత ఎమ్మెల్యే మార్కెట్ కు సందర్శనకు వచ్చి.. కమిటీ మీటింగ్ లో పాల్గొని.. వెళ్లారే తప్ప.. ఏనాడు మార్కెట్ సమస్యలను పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితిలో.. ప్రస్తుత మానుకోట ఎమ్మెల్యే అయినా... కేసముద్రం మార్కెట్ ను మోడల్ గా తీర్చిదిద్దడంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని గిరిజన ఆదివాసీ ఇతర రైతన్నల బాధలను పరిష్కరించాలని కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి మోడల్ మార్కెట్ అంశాన్ని తీసుకెళ్లాలని పలు రాజకీయ పక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి తన బాధ్యతను తాను నిర్వర్తించాలని కేసముద్రం ప్రజానీకం కోరుతుంది. మరి ఆ దిశగా అడుగులు వేస్తాడా లేక మనకెందుకులే అని చేతులు దులుపుకుంటాడా చూడాలి...**

# ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట

## - ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

మహబూబాబాద్ మార్చి 7(ప్రభాత గమనం): రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తుందని ప్రభుత్వ విప్ డా.రాం చంద్రునాయక్ అన్నారు. శనివారం డోర్నకల్ మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ హాజరై హెల్త్ క్యాంప్ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ మాట్లాడుతూ..ప్రజల ఆరోగ్య రక్షణ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని తెలిపారు. గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం పలు ఆరోగ్య కార్యక్రమాలను నిర్వహిస్తుందని చెప్పారు. హెల్త్ క్యాంప్ ద్వారా ప్రజలు ఆరోగ్య పరీక్షలు చేయించుకొని అవసరమైన వైద్య సలహాలు తీసుకోవాలని సూచించారు.అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ..ప్రజలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ



పెట్టాలని, ఇటువంటి ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ హెల్త్ క్యాంప్లో వైద్యులు పలువురికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, అధికారులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణాల్లో తనిఖీ

కేసముద్రం, మార్చి 7 (ప్రభాత గమనం): కేసముద్రం మండలంలోని పలు ఎరువుల దుకాణాలను మహబూబాబాద్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు అజ్మీరా శ్రీనివాసరావు, కేసముద్రం మండల వ్యవసాయ అధికారి బి. వెంకన్న కలిసి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి డీలర్ రైతులకు యూరియాను తప్పనిసరిగా యూరియా బుకింగ్ యాప్ ద్వారా మాత్రమే సరఫరా చేయాలని సూచించారు. అలాగే ప్రతిరోజూ స్టాక్ రిజిస్టర్ బ్యాలెన్స్, పీఓఎస్ బ్యాలెన్స్, గోదాం బ్యాలెన్స్ సమానంగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. అనంతరం కేసముద్రం మండలంలోని తార్యతండ గ్రామ శివారులో వరి పంట క్షేత్రాలను గ్రామ రైతులతో కలిసి సందర్శించారు. ప్రస్తుతం వరి పంటలో అగ్గి తెగులు, పొడ తెగులు, మొగి పురుగు మరియు జింక్ లోపం ఉన్నట్లు గుర్తించారు. అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ మందును ఒక లీటర్ నీటికి 0.6 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పొడ తెగులు నివారణకు ప్రొపికొనోజోల్ మందును ఒక లీటర్ నీటికి 1 మిల్లీలీటర్ కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. మొగి పురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ అనే పురుగుమందును ఒక లీటర్ నీటికి 2 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి. వెంకన్న, రైతులు మూడవత్ శంకర్, రాజ్ కుమార్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



# గార్ల మండలంలో బెల్టు దందా

- గ్రామాల్లో యథేచ్ఛగా అమ్మకాలు
- సిండికేట్ల లాభాలు
- తూతూ మంత్రంగా ఎక్సైజ్ దాడులు
- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న బెల్ట్ షాపులు



గార్ల మార్చి 6(ప్రభాత గమనం): పట్టణాల్లో ఉండాల్సిన మద్యం దుకాణాలు నేడు పల్లెల్లో గల్లీకొకటి వెలుస్తున్నాయి.మద్యం విక్రయితలు విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు చేస్తున్నారు. దీంతో ఉదయం నుంచి మొదలుకొని రాత్రి వరకు మద్యం అమ్మకాలు జోరుగా సాగుతుండటంతో బెల్టుషాపులలో మద్యం ఏరులై పారుతోంది. బెల్టుషాపులు లేవని అధికారులు చెబుతున్నా అవి లెక్కల వరకే పరిమితమవుతున్నాయి. నూతనంగా ఎక్సైజ్ శాఖ మద్యం పాలసీని తీసుకువచ్చి ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయించేలా, కల్తీ మద్యాన్ని అరికట్టేలా చర్యలు తీసుకోవాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో బెల్టుషాపు నిర్వాహకులకు హద్దులేకుండా పోతుంది. దీంతో వారి వ్యాపారం మూడు క్వార్టర్లు, ఆరు బీర్లుగా కొనసాగుతోంది. గార్ల మండలంలో దాదాపుగా అన్ని గ్రామాల్లో ఒకటి నుంచి రెండు బెల్టు షాపులు నిర్వహణ కొనసాగుతుందంటే ఎక్సైజ్ అధికారుల పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

### - ఎనీ టైం మద్యం..

గ్రామాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసుకున్న బెల్టుషాపుల సమయపాలన లేకుండా తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు మద్యం అందుబాటులో ఉంటుంది. గ్రామాల్లోని కూలి పనులు చేసుకునే నిరుపేదలు బెల్టుషాపులకు అలవాటుపడి కూలీ పనులకు సైతం పోకుండా నిత్యం గ్రామాల్లో మద్యం మత్తులో ఉంటున్నారు. గార్ల,డోర్నకల్ వైన్స్ షాపుల నుంచి మద్యం కొనుగోలు చేసి గ్రామాలకు తీసుకువెళ్లి ఒక మద్యం బాటిల్పై ఎంఆర్పీ రేటు కంటే రూ.30 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు.

### - పట్టించుకోని అధికారులు

గ్రామాల్లో మద్యం అమ్మకాలు సిండికేట్గా మారడంతో బెల్టుషాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. హోటళ్లు, కిరాణా షాపులు బెల్ట్ షాపులు గా తయారవుతున్నాయి. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు లాభార్జన ధ్యేయంగా గ్రామీణ ప్రాంతాల వారికి విక్రయిస్తున్నారు. మద్యం షాపులను రహదారుల పక్కన నిర్వహించరాదని అధికారికంగా వెల్లడించినప్పటికి గ్రామాల్లో రోడ్ల పక్కనే దర్జాగా మద్యం విక్రయిస్తున్నా సంబంధిత ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో ఉండి పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

### - నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహించడం వలన మద్యానికి బానిసైన కుటుంబాలు అప్పులపాలై రోడ్డున పడుతున్నారు.చాలా కుటుంబాలు తమ కష్టమంతా తాగుడికే ధారపోస్తున్నారు. గ్రామాల్లో మద్యానికి బానిసైన కొందరు వ్యక్తులు అనారోగ్యం పాలవడం తో పాటు కుటుంబాలు అప్పుల కొరల్లో చిక్కుకోవడం, గొడవలు వంటి సంఘటనలు చేటు చేసుకోవడంతో ముఖ్యంగా యువత మద్యానికిఆకర్షితులవుతున్నారు. గ్రామాల్లో ఎక్కువగా ప్రజల మధ్య అల్లరులు, గొడవలు జరగడానికి మద్యం కారణమవుతోంది. బెల్టుషాపుల నిర్వాహకులపై ఎక్సైజ్ ఎలాంటి చట్టపరమైన చర్యలు అధికారులు తీసుకుంటారో వేచిచుడాలి.




# సమాజంలో మహిళల పాత్ర

## –రాజ్యాంగ హక్కులు, రక్షణ చట్టాలు

- ప్రతి సంవత్సరం మార్చి 8న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవంను ఎంతో గౌరవంగా జరుపుకుంటారు. ఈ రోజు మహిళల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ విజయాలను స్మరించుకునే రోజు మాత్రమే కాకుండా, లింగ సమానత్వం కోసం మహిళలు చేసిన పోరాటాన్ని గుర్తుచేసుకునే ముఖ్యమైన రోజు కూడా.
- మహిళ అంటే కేవలం తల్లి మాత్రమే కాదు, అక్క లేదా చెల్లి మాత్రమే కాదు. మహిళ అంటే ఒక శక్తి, ధైర్యానికి ప్రతీక, త్యాగానికి నిదర్శనం. సమాజంలో మహిళలు ఎన్నో రంగాల్లో అద్భుతాలు సృష్టిస్తూ తమ ప్రతిభను చాటుతున్నారు. ఒకప్పుడు కొన్ని రంగాలకు మాత్రమే పరిమితమైన మహిళలు, నేడు దేశ సేవలో కీలక పాత్ర పోషిస్తున్నారు.
- మన దేశాన్ని కాపాడే ఆర్మీలో, ప్రజల భద్రత కోసం పోరాడే పోలీస్ విభాగంలో, ప్రమాదాల మధ్య సేవ చేసే ప్రత్యేక దళాల్లో మహిళలు తమ ధైర్యసాహసాలతో ప్రత్యేక స్థానాన్ని సంపాదించారు. ఎండైనా, వర్షమైనా, పగలైనా, రాత్రైనా దేశ సరిహద్దుల్లో నిలబడి దేశ రక్షణ కోసం పోరాడుతున్న ఆ ధైర్యవంతులైన మహిళలు మనందరికీ గర్వకారణం.
- మహిళలు ఆర్మీ, పోలీస్, రక్షణ రంగాలతో పాటు విద్య, వైద్య, రాజకీయ, ఆర్థిక, సామాజిక సేవ, సాంస్కృతిక రంగాల్లోనూ అగ్రగామిగా నిలుస్తున్నారు. వారి కృషి సమాజ అభివృద్ధికి ఎంతో తోడ్పడుతోంది. వారి ధైర్యసాహసాలకు మనం గౌరవం తెలుపుతూ కృతజ్ఞతలు తెలియజేయాలి.
- మహిళా దినోత్సవం ముఖ్య ఉద్దేశం లింగ సమానత్వాన్ని పెంపొందించడం. పురుషులతో సమానంగా మహిళలకు గౌరవం, హక్కులు కల్పించడమే కాకుండా మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టడం కూడా ఎంతో అవసరం. ఆసిడ్ దాడులు, గృహ హింస, లైంగిక వేధింపులు వంటి ఘటనలను నిరోధించేందుకు భారత రాజ్యాంగం మహిళలకు అనేక హక్కులు, రక్షణ చట్టాలను అందించింది.
- మహిళలు కేవలం కుటుంబ వ్యవస్థకే పరిమితం కాకుండా దేశ అభివృద్ధిలో కూడా ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. విద్య, వైద్య, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో రాణిస్తూ తమకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదిస్తున్నారు. మహిళల సాధనను గుర్తించి వారిని అభినందించడం, సమాజంలో వారి పాత్రను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత.

**ఈ సందర్భంగా సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రతి మహిళకు హృదయపూర్వకంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.**



**రచయిత:**
**మంద ప్రవీణ్ (MA, B.Ed)**
**ఫోన్: 8499832828**



# కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

కేసముద్రం మార్చి 7(ప్రభాత గమనం): కేసముద్రం మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామంలోని స్వయంభూ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడవ శనివారం లక్ష పుష్పాలతోలతో సహస్ర నమార్చన పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు గంప లక్ష్మణాచార్యులు, గంప శ్రావణ్ కుమారాచార్యులు మాట్లాడుతూ..ప్రతి సంవత్సరం స్వామీ వారికి తెలుగు నామ సంవత్సరం ఉగాదికి ముందు నాలుగు శనివారాలు బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు. గ్రామం నుండే కాకుండా మండలం చుట్టూ ప్రక్కల గ్రామాల నుంచి ప్రజలు తండోపతండాలుగా తరలి వచ్చి పూజలు నిర్వహిస్తారాన్నారు. గతంలో ఇక్కడ స్వామీ వారి దేవాలయం చుట్టూ ఎడ్ల బండ్లు కూడ తిరిగేవని, నాలుగు వారాలు పండుగ వాతావరణం ఉండేదని, కోరిన కోర్కెలు తీర్చే దేవుడిగా ప్రజలు కొలుస్తారని అన్నారు.

# వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



మహబూబాబాద్, మార్చి 7 (ప్రభాత గమనం): నెల్లికుదురు మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న, తహసీల్దార్ చందా నరేష్, ఎంపీడీవో ఎస్.కుమార్, వైద్యాధికారి డా. చైతన్య శనివారం సందర్శించి విద్యా, వసతి, భోజన సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదువులో ముందుకు సాగి వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని సూచించారు. మానసిక ఆరోగ్యం, క్రీడలు, వ్యాయామంపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, తాజా వేడి ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. జ్వరం, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని, స్వీయచికిత్స చేయరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుమలతతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

మహబూబాబాద్, మార్చి 7 (ప్రభాత గమనం): జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయాలని జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్ అధికారులకు ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్లో రెవెన్యూ, పోలీస్, మైనింగ్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాను అన్ని శాఖలు సమన్వయంతో అరికట్టాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం సూచించిన విధంగా అవసరమైన ఇసుకను సమయానికి సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అనిల్ కుమార్, మైనింగ్ అధికారి వెంకటరమణ, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# టెన్త్ పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించాలి

**–జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**



మహబూబాబాద్, మార్చి 7 (ప్రభాత గమనం): రానున్న పదవ తరగతి పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించేందుకు అధికారులు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టోప్పో, కె. అనిల్ కుమార్‌తో పాటు విద్యాశాఖ, సంక్షేమ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ వసతి గృహాల్లో హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, సానిటేషన్ అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కామన్ డైట్ మెనూను పకడ్బందీగా పాటిస్తూ నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. విద్యార్థులకు, సిబ్బందికి షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు పిల్లల మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక కౌన్సెలింగ్ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. విద్యాసంస్థల్లో ర్యాగింగ్ వంటి సంఘటనలు జరగకుండా వార్డెన్లు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన చోట పోలీస్ శాఖతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ప్రతి వసతి గృహంలో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేసి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. పాఠశాలల్లో అందించే భోజనాన్ని ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ చేసి ధ్రువీకరించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ తిరుపతిరావు, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్వర్, సంక్షేమ శాఖ అధికారులు, ఎంఈఓలు, డీసీవోలు తదితరులు పాల్గొన్నారు.

# మహబూబాబాద్ లో ఉద్యోగ మేళా



మహబూబాబాద్, మార్చి 7 (ప్రభాత గమనం): డీఆర్‌డీఏ–ఈజీఎంవైఎం మహబూబాబాద్ జిల్లా ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత యువతీ, యువకుల కోసం ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మధుసూదన రాజు తెలిపారు. జహీరాబాద్‌లోని మహీంద్రా & మహీంద్రా లిమిటెడ్ సంస్థలో ఖాళీగా ఉన్న అప్రెంటిస్ ఉద్యోగాల కోసం పదవ తరగతి, ఇంటర్ పాస్ లేదా ఏదైనా ఐటీఐ ట్రేడ్ అర్హత కలిగి 18 నుంచి 25 సంవత్సరాల మధ్య వయస్సు గల నిరుద్యోగ అభ్యర్థులను ముఖాముఖి ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన వారికి రూ.12,000 నుంచి రూ.14,300 వరకు స్టైపెండ్/జీతం అందజేయబడుతుందని తెలిపారు. అదనంగా ప్రతి నెల రూ.1,000 హాజరు బోనస్, సబ్సిడీ కాంటీన్ సౌకర్యం, ఉచిత రవాణా, యూనిఫారం, టీషర్ట్, షూస్ వంటి సదుపాయాలు కల్పించబడతాయని వెల్లడించారు. ఈ ఉద్యోగ మేళా మార్చి 13న ఉదయం 10.30 గంటలకు మహబూబాబాద్ జిల్లా సమాఖ్య కార్యాలయం (రామమందిరం ఎదురుగా, రైల్వే స్టేషన్ సమీపంలో) నిర్వహించబడుతుంది. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా, విద్యార్హత ధృవపత్రాల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు జాబ్స్ డిస్ట్రిక్ట్ మేనేజర్ జి. గణేష్ (మొబైల్: 8522054266) ను సంప్రదించాలని తెలిపారు.

# చొప్పరి వెంకటయ్య మరణం పార్టీకి తీరని లోటు

**–సిపిఐ జిల్లా కార్యదర్శి బి. విజయ సారథి**



కేసముద్రం, మార్చి 7 (ప్రభాత గమనం): సిపిఐ సీనియర్ నాయకులు చొప్పరి వెంకటయ్య మరణం పార్టీకి తీరని లోటని సిపిఐ జిల్లా కార్యదర్శి బి. విజయ సారథి అన్నారు. శనివారం పూజారి రవి అధ్యక్షతన వెంకటయ్య సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయసారథి మాట్లాడుతూ గత 50 ఏళ్లుగా కేసముద్రం మండలంలో పార్టీకి వెన్నుదన్నుగా నిలిచి భూస్వామ్య వ్యతిరేక పోరాటాల్లో వెంకటయ్య కీలక పాత్ర పోషించారని తెలిపారు. భూ పోరాటాలు, తెలంగాణ ఉద్యమం వంటి అనేక ఉద్యమాల్లో ఆయన చెరగని ముద్ర వేసారని పేర్కొన్నారు. వెంకటయ్య ఆశయ సాధన కోసం పార్టీ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి. అజయ్ సారథి రెడ్డి, పంజాల రమేష్, శేఖర్, భూలోక రెడ్డి, కమటం ఉపేందర్, మంద భాస్కర్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



# హెచ్‌పీవీ వ్యాక్సిన్ పోస్టర్ ఆవిష్కరణ

మహబూబాబాద్, మార్చి 7 (ప్రభాత గమనం): 14 సంవత్సరాల వయస్సు గల బాలికలకు గర్భాశయ క్యాన్సర్ నివారణ కోసం ఇవ్వనున్న హెచ్పీవీ వ్యాక్సిన్‌కు సంబంధించిన పోస్టర్‌ను శనివారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్ మాట్లాడుతూ జిల్లాలో 14 సంవత్సరాల వయస్సు గల బాలికలకు ఆదివారం హెచ్పీవీ వ్యాక్సిన్‌ను ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, తొర్రూరు ఏరియా ఆసుపత్రి, గూడూరు ఆసుపత్రుల్లో అందించనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 6670 మంది బాలికలు ఈ వ్యాక్సిన్‌కు అర్హులుగా ఉన్నారని చెప్పారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో డిఐఓ డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ శ్రావణ్, డాక్టర్ విజయ్, జయరాం, స్వామి  పాల్గొన్నారు.



# దెబ్బతిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలి

**–ఎంసిపిఐయు జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న**

కేసముద్రం, మార్చి 7 (ప్రభాత గమనం): ఖరీఫ్ సీజన్‌లో నష్టపోయిన పంటలకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని ఎంసిపిఐయు పార్టీ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఎంసిపిఐయు, ఏఐసిటియు ఆధ్వర్యంలో రైతులకు నష్టపరిహారం చెల్లించాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరదల కారణంగా పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు వ్యవసాయ అధికారులు సర్వేలు నిర్వహించినప్పటికీ ఇప్పటి వరకు రైతులకు నష్టపరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన రైతుల ఖాతాల్లో పరిహారం జమ చేయాలని, లేనిపక్షంలో దశలవారీగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంసిపిఐయు మండల సహాయ కార్యదర్శి బొల్లోజు రామ్మోహనచారి, గంద్రకోటి యాకయ్య, కార్మిక సంఘ నాయకులు గుగులోతు రాజు, నేరడ వీరస్వామి, ఎం. వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# అక్షర రూప శిల్పులు.. ఆదర్శ మహిళలు

## మాకొడి ఉన్నత పాఠశాలలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



అనంతపురం, ప్రభాత గమనం ప్రతినిధి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మాకొడి ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఆదివారం సెలవు కావడంతో ఒక రోజు ముందుగానే శనివారం పాఠశాల ఆవరణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒక చేత్తో కుటుంబాన్ని, మరో చేత్తో దేశ భవిష్యత్తైన విద్యార్థులను తీర్చిదిద్దే గొప్ప శక్తి మహిళ అని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పేర్కొన్నారు. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉపాధ్యాయురాళ్ల కృషిని అభినందిస్తూ సహచర ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల క్రమశిక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న రమాదేవి, ఉషారాణి, శిరీషలను ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దేనాయక్ నాగిరెడ్డి, ఓబులేష్, నాగభూషణలు మహిళా ఉపాధ్యాయులను సత్కరించి వారి సేవలను కొనియాడారు.

# 'వేం' కు శుభాకాంక్షలు



కేసముద్రం మార్చి 7(ప్రభాత గమనం): రాజ్యసభ సభ్యుcrగా ఇటీవల నామినేషన్ దాఖలు చేసిన వేం నరేందర్ రెడ్డిని కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్ లో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సత్కరించారు. మరెన్నో పదవులు చేపట్టి ప్రజలకు మున్ముందు సేవలు చేయాలని కాంక్షించారు. కేసముద్రం మండలాన్ని మరింత అభివృద్ధి పరచాలని కోరారు. కార్యక్రమంలో సామల నర్సయ్య, బాలు, వెంకన్న, రవి, లక్ష్మణ్, మసాడి శ్రీను, బద్రు తదితరులు పాల్గొన్నారు.

Published and Owned by Pitta Sreekanth at .H NO 1-7-883/6/101 VIVEKANANDA COLONY HUNTER ROAD HANUMAKONDA, WARANGAL URBAN, TELANGANA, 506001 Editor. P. Ravichandra